
సాక్షి ఒడిశా

శనివారం ၊ 14 ၊ జూన్ ၊ 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 1,57,242
- భువనేశ్వర్/పూరీ



వికాస్ మేళా ప్రారంభం

మల్కన్‌గిరిలో వికాస్ మేళా ప్రారంభమైంది. గిరిజనులు స్టాళ్లు ఏర్పాటు చేశారు.

- 8లో



75 మంది బహిష్కరణ

75 మందిని సామాజికంగా బహిష్కరించారు. బంకులి గ్రామంలో ఘటన జరిగింది.

- 8లో

న్యూస్‌రీల్

పతిత పావనుడికి పూజలు



పూజలు అందుకుంటున్న అనంత నారాయణ్

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం సింహ ద్వారం ఆవరణలో కుడ్య ప్రతిమ పతిత పావనుడిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించాడు. రత్నవేదికపై కొలువుదీరిన మూల విరాటు అస్వస్థతతో తెరమరుగు కావడంతో జగన్నాథుని స్థానంలో అనంత నారాయణ్ చిత్రపటం నిత్య పూజలు అందుకుంటున్నాడు. మూల విరాటుల సహజ దర్శనం పునరుద్ధరించేంత వరకు పతిత పావనుని ఇలా దర్శించుకోవడం నిరవధికంగా కొనసాగుతుంది.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



ఆదివాసీ మహిళలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలో గల నవజీవన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదలైన 40 మంది ఆదివాసీ మహిళలకు ఉచితంగా నిత్యావసరాల వస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. అన్నలక్ష్మీ పథకం కింద ప్రతి నెల బియ్యం, నూనె, బంగాళాదుంపలు, కంది పప్పు తదితర వస్తువులను పంపిణీ చేస్తున్నామని ట్రస్టు నిర్వాహకులు ఎం.నళిని తెలియజేశారు. ఇదిలాఉండగా ఈ సారి నిత్యవసరాల వస్తువులతో పాటు మామిడి పళ్లు, బిస్కెట్, రొట్టెలను పంపిణీ చేశామని ఆమె తెలిపారు. తిరుపతిలో గల నవజీవన్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీధర్ ఆచార్య ప్రతి నెల నిరుపేదలకు అన్న లక్ష్మీ పేరిట నిత్యావసరాల పంపిణీ చేస్తున్నారని, అదేవిధంగా రాయగడలో గల ట్రస్టు ఆధ్వర్యంలో ఎందరినో చదివిస్తున్నారని తెలిపారు.

చంద్రపూర్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలతో లబ్ధిదారులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో 35 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను శుక్రవారం పంపిణీ చేశారు. అదనపు తహసీల్దార్ ఆశీష్ కుమార్ ప్రధాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రహి, సిబ్బంది మోతీలాల్ సామల్ తదితరులు లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన వారిలో ఉన్నారు. లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రాయగడ: కలహండి జిల్లా భవానీపట్నం నుంచి రాయగడకు అల్యూమిన పైపులతో వస్తున్న లారీ జిల్లాలోని అంబొదల సమీపంలో శుక్రవారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలోని పైపులు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం తెలుసుకున్న అంబొదల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ప్రమాదంలో లారీ డ్రైవర్, హెల్పరు సురక్షితంగా బయటపడ్డారు.

తమ్ముడిపై దాడి ఘటనలో అన్న అరెస్టు



అరెస్టయిన హరి ముదిలి

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి బలిమెల పోలీసు స్టేషన్ పరిధిలో రాస్బేధ పంచాయతీ పల్లంగూడలో ఈ నెల 8న భూమి విషయమై తమ్ముడు తిరుపతి ముదిలిని బాణంతో గాయపరిచిన అన్నహరి ముదిలిని బలిమెల పోలీసులు గురువారం అరెస్టు చేశారు. విచారణ అనంతరం కోర్టుకు తరలిస్తామని ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ తెలిపారు. తిరుపతి ప్రస్తుతం బరంపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మహిళా సాధికారతలో..

రాష్ట్రం ఆదర్శం: సీఎం



రాష్ట్ర స్థాయి నారీ శక్తి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగం



ఉత్తమ మహిళా కార్యకర్తకు ముఖ్యమంత్రి సత్కారం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం సాధికారతతో మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలపరిచేందుకు కట్టుబడి ఉందని సీఎం మోహన్ చరణ్ మాఝి అన్నారు. మహిళల స్వావలంబన కోసం సంకల్పించిన సుభద్ర యోజన విజయవంతం కావడం ఒక ప్రధాన ఉదాహరణ అని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ పాలన ఏడాది పూర్తి పురస్కరించుకుని కటక్ నగరం బలియాత్ర గ్రౌండులో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి నారీ శక్తి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహిళలను గౌరవించడం రాజకీయ శిక్షణలో తొలి అంశంగా పేర్కొన్నారు. ఒడిశా నారీ శక్తిని అత్యుత్తమ శక్తిగా మార్చడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. లక్షాధికారి సోదరి (లఖ్యపతి దీదీ) ఆవిష్కరణలో ఒడిశా ప్రస్తుతం భారత దేశంలో అగ్రస్థానంలో కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో 16 లక్షలకు పైగా లక్షాధికారి సోదరిలను సృష్టించడం మహిళా సాధికారతకు నిలువెత్తు తార్కాణంగా అభివర్ణించారు.

సుభద్ర యోజన ఒడిశా చరిత్రలో అతిపెద్ద మహిళా సంక్షేమ కార్యక్రమమని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామం, ప్రతి కుటుంబంతో ప్రభుత్వం ప్రత్యక్షంగా సంప్రదించి సమగ్ర సమాచారంతో వాస్తవ లబ్ధిదారుల్ని పరిగణనలోకి తీసుకుని పథకం ప్రయోజనం చేరదీయడం విశేషమన్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లోనూ మహిళల్ని చైతన్యపరచి పథకంలో చేర్చడం ప్రభుత్వం దృఢ సంకల్పానికి నిదర్శనమని తెలిపారు.

ఏడాది పాలనలో అన్ని ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా స్వయం సహాయక బృందాలకు రూ. 3 వేల 695 కోట్ల విలువైన వ్యాపార అవకాశాలను కల్పించాయని. రాష్ట్ర చరిత్రలో ఇది ఆల్ టైమ్ రికార్డ్‌గా పేర్కొన్నారు. 3.07 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలకు రుణాలపై రూ. 300 కోట్ల వడ్డీని తిరిగి చెల్లించి వారి ఆర్థిక కలలను సాకారం చేయడంలో ప్రభుత్వం వారధిగా నిలిచిందన్నారు. ఈ ఏడాది మహిళల కోసం రూ. 89,861 కోట్ల నిధుల్ని బడ్జెట్‌లో కేటాయించి మహిళలకు పట్ట ప్రభుత్వ నిబద్ధత చాటుకుందని, మహిళా సాధికారతలో ఆదర్శ రాష్ట్రంగా ఒడిశా ఇతర రాష్ట్రాలకు ప్రేరణగా నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్ తన ప్రసంగంలో, మహిళా శక్తి అభివృద్ధి చెందిన, సంపన్నమైన, గర్వించదగిన ఒడిశా ఆవిష్కరణలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా మాట్లాడుతూ సమానత్వం, శ్రేయస్సు, పురోగతి రాష్ట్రంగా ఒడిశాను నిర్మించాలనే సంకల్పానికి ఈ కార్యక్రమం తొలి వేదికగా నిలుస్తుందన్నారు. వచ్చే ఏడాది సరికి రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో లక్షాధికారి సోదరి, ప్రతి పంచాయతీలో కోటీశ్వర మహిళల్ని ఆవిష్కరించడం తథ్యమని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మహిళా శిశు అభివృద్ధి శాఖ అమలు చేసిన పోషణ్ అభియాన్‌లో అట్టడుగు స్థాయి నుంచి రాష్ట్రంలోని వివిధ లిఖిత, ఫొటో చిత్రాలతో కూడిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి, ఇతర అతిథులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత శాఖ ఆధ్వర్యంలో విశేష కృషి చేసిన మహిళలను ముఖ్యమంత్రి సత్కరించారు.

కటక్ లోక్ సభ సభ్యుడు భర్తృహరి మహతాబ్, జగత్‌సింగ్‌పూర్ లోక్ సభ సభ్యుడు బిభు ప్రసాద్ తొరై, కటక్ నియోజక వర్గం శాసన సభ సభ్యుడు ప్రకాష్ సెఠి, బొడొంబ నియోజక వర్గం శాసన సభ సభ్యుడు విజయ్ డాల్‌బెహెరా, నియాలి నియోజక వర్గం శాసన సభ సభ్యుడు అభిషేక్ మల్లిక్, మహంగా నియోజక వర్గం శాసన సభ సభ్యుడు శారద ప్రసాద్ ప్రధాన్, జిల్లా మేజిస్ట్రేట్ దత్తాత్రేయ భౌసాహెబ్ షిండే, మహిళా సాధికారత శాఖ ప్రముఖ కార్యదర్శి శుభ శర్మ, డైరెక్టర్ మోనిషా బెనర్జీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

భద్రక్‌లో ఇంటర్నెట్ సేవల నిలిపివేత పొడిగింపు

భువనేశ్వర్: భద్రక్ జిల్లా తిహిడి మండలం కొసాటి గ్రామానికి చెందిన సంతోష్ పరిడా మే నెల 30న మారణాంతక దాడికి గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచాడు. దీంతో భద్రక్ జిల్లాలో మతపరమైన దాడులు రగిలాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇంటర్నెట్ వ్యవస్థని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు నిరవధికంగా నిలిపివేసినట్లు ప్రకటించింది. పరిస్థితి కుదుటపడక పోవడంతో ఈ ప్రాంతంలో ఇంటర్నెట్ సదుపాయం నిలిపివేత మరో 12 గంటలపాటు పొడిగించినట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. శుక్ర వారం సాయంత్రం 6 గంటల వరకు ఇంటర్నెట్ నిలిపివేత నిరవధికంగా కొనసాగింది. భద్రక్ జిల్లాలోని భద్రక్ మునిసిపాలిటీ, భద్రక్ మండలం, ధామ్‌నగర్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్, ధామ్‌నగర్ మండలం మరియు తిహిడి మండలం 5 ప్రాంతాల్లో గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

భద్రక్ జిల్లాలో జరిగిన హింసాత్మక వర్గ ఘర్షణలో గాయపడి మరణించిన వ్యక్తి కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయాన్ని ప్రకటించారు. భద్రక్ జిల్లా తిహిడి ప్రాంతంలో జరిగిన మత ఘర్షణలో గాయపడి, చికిత్స పొందుతూ మరణించిన సంతోష్ పరిడా (46) పిల్లల చదువుకు అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు.

సంతోష్ పరిడా కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుండి పది లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. అంతే కాకుండా మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని కూడా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం దుఃఖంలో ఉన్న కుటుంబానికి అండగా నిలుస్తుందని, శాంతి నెలకొనేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది అని ముఖ్యమంత్రి అభయం ఇచ్చారు.

జాజ్‌పూర్ జిల్లాలో ప్రబలిన డయేరియా



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడుతున్న అధికార బృందం

- వ్యాధిపై ఆర్‌డీసీ సమీక్ష

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లాలో అతిసార పంజా విసిరింది. వ్యాధిలక్షణాలతో బాధపడుతున్నవారి సంఖ్య భారీగా పెరుగుతోంది. ప్రధాన ఆస్పత్రుల్లో బాధితులు చికిత్స పొందుతున్నారు. ఈ పరిస్థితిని క్షేత్ర స్థాయిలో సమీక్షించేందుకు కేంద్ర రెవెన్యూ అధికారి (ఆర్‌డీసీ) వి.దీన్ జాజ్‌పూర్ జిల్లాలోని ధర్మశాల, వ్యాసనగర్ ఆస్పత్రులతోపాటు జిల్లా ప్రధాన ఆస్పత్రిని శుక్రవారం సందర్శించారు. చికిత్సపొందుతున్న రోగులతోపాటు బంధువులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అతిసార వ్యాప్తి చెందడానికి కారణాలను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారి, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్, ఆహార భద్రత శాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా కలెక్టర్, జిల్లా ముఖ్య వైద్య అధికారి, మండల అధికారి, వైద్యులతో మాట్లాడిసి పరిస్థితిపై ఆరా తీశారు. బాధిత ప్రజలకు తగిన వైద్య సేవలను అందించాలని ఆర్‌డీసీ ఆదేశించారు.

మూడు గంటలు నరక యాతన!



సహాయ చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది



చిక్కుకున్న డ్రైవర్ గురునాం సింగ్



హైడ్రాలిక్ యంత్రాలతో వాహనాన్ని కోస్తున్న దృశ్యం

కొరాపుట్: ప్రమాదం జరిగిన ట్రక్‌లో ఇరుక్కుని డ్రైవర్ మూడు గంటలు నరక యాతన పడ్డాడు. శుక్ర వారం వేకువ జామున 2.30 గంటల సమయంలో జయపూర్–నబరంగ్‌పూర్ మార్గంలో హరడాపుట్ గ్రామం వద్ద 26వ నంబర్ జాతీయ రహదారిపె నిలిపి ఉన్న ట్రక్‌ని పాల ట్యాంకర్ ఢీకొట్టింది. ఉమ్మర్‌కోట్ నుంచి విశాఖపట్నానికి పాల లోడుతో వెళ్తున్న ట్యాంకర్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ గురునాం సింగ్ తన సీటులో చిక్కుకు పోయాడు. పోలీసుల సమాచారంతో జయపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. హైడ్రాలిక్ కుంబి టూల్స్ వినియోగించి సుమారు మూడు గంటల ప్రత్యేక ఆపరేషన్ ద్వారా డ్రైవర్‌ని బయటకు తీసి జయపూర్‌లోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు ఫైర్ స్టేషన్ అధికారి సురేష్ బారిక్ వెల్లడించారు.

కులాంతర వివాహం..

40 మందికి శిరోముండనం



గుండు గీయించుకున్న యువతి తరఫు బంధువులు

రాయగడ: నేటి ఆధునిక ప్రపంచంలోనూ ఇంకా అనేక చోట్ల మూఢ నమ్మకాలు కొనసాగుతునఆనయి. కులాంతర వివాహం చేసుకుందన్న కారణంతో యువతి కుటుంబీకులు 40 మంది శిరోముండనం చేసుకున్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రాయగడ జిల్లా కాశీపూర్ సమితి గొరక్‌పూర్ పంచాయతీలో ఓ గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి, వేరే షెడ్యూల్ తెగకు చెందిన యువకుడు ప్రేమించుకున్నారు. పెళ్లికి యువతి తరపు బంధువులు, కుటుంబీకులు అంగీకరించలేదు. దీంతో రహస్యంగా వివాహం చేసుకున్నారు. పెళ్లి చేసుకున్న యువ జంట తమ బంధువులు, కుటుంబీకులను కలసి ఆశీర్వాదం తీసుకునేందుకు గురువారం స్వగ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు ఊరికట్టుబాట్లను కాదని కులాంతర వివాహం చేసుకున్నందుకు శిక్ష విధించారు. గ్రామ కట్టుబాట్ల ప్రకారం యువతి కుటుంబీకులను గ్రామ బహిష్కరణ చేశారు. ఈ శిక్ష నుంచి తప్పించుకోవాలంటే యువతి బంధువులు, కుటుంబీకులు శిరోముండనం చేసుకోవడంతో కర్మకాండలను నిర్వహించి మూగజీవాలను బలి ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకు యువతి కుటుంబీకులు అంగీకరించారు. 40 మంది శిరోముండనం చేసుకుని మూగజీవాలను బలిచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించగా వారిని తిరిగి కులంలో కలుపుకున్నట్లు ప్రకటించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పోలీసుల వద్ద ఎటువంటి సమాచారం లేదు.

ఆటో బోల్తా పడి బాలుడు దుర్మరణం



బాలుడి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు



సంఘటనా స్థలం వద్ద మృతుని బంధువులు



విలపిస్తున్న తల్లిదండ్రులు



ప్రమాద స్థలంలో గుమిగూడిన జనం

జయపురం: ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనో 12 ఏళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం 26వ జాతీయ రహదారి డెప్పుగుడ జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. జయపురం నుంచి బరిణిపుట్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ప్రమాదానికి గురై బాలుడు మృతి చెందిన సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. బాలుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. మరణించిన బాలుడు జయపురం సమితి బరిణిపుట్ గ్రామానికి చెందిన త్రిపతి పాత్రో కుమారుడు నితేష్ పాత్రోగా తెలిసింది. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో త్రిపతి పాత్రో దంపతులు గుండెలవిసేలా రోదించారు.

ఇద్దరు మావోయిస్టులు అరెస్టు



అరెస్టయిన మావోయిస్టులతో పోలీసులు



స్వాధీనం చేసుకున్న సామగ్రి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో శుక్రవారం ఇద్దరు మావోయిస్టులను అరెస్టు చేసినట్లు ఎస్పీ వినోద్ పటేల్ తెలిపారు. మత్తిలి పోలీసు స్టేషన్ పరిధిలోని సోడిగూడ వద్ద వీరిని పట్టుకున్నట్లు చెప్పారు. కొరాపుట్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తుండగా డీవీఎఫ్ జవాన్లకు పట్టుబడ్డారని తెలిపారు. వీరిద్దరూ ఆంధ్రా–ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గాంగులూర్‌కు చెందిన రాకేష్ కుంజం అలియాస్ మున్న కుంజం, కేశు కబాసిగా గుర్తించారు. సుక్మా జిల్లా కాంగేర్‌ఘాటి ఏరియా కమిటీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న వీరిపై రూ.4లక్షలు చొప్పున మొత్తం రూ.8లక్షలు రివార్డు ఉంది. వీరి వద్ద నుంచి రెండు రివాల్వర్లు, సాహిత్యం, వాకీటాకీ బ్యాటరీ, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

నాగేశ్వరి గుహల్లో గేటు చోరీ



బల్దా నాగేశ్వరి గుహలకు వెళ్లే ప్రధాన దారి వద్ద మాయమైన గేటు

కొరాపుట్: వివాదాస్పద నాగేశ్వరి గుహల ప్రవేశ మార్గం గేటు చోరీకి గురయ్యింది. నందపూర్ సమితి నుంచి వెళ్లే ఈ మార్గంలో ప్రధాన గేటు చోరీ జరిగినట్లు స్థానికులు శుక్రవారం గుర్తించారు. సముద్ర మట్టానికి 1,300 మీటర్ల ఎత్తులో బల్దా నాగేశ్వరి గుహల పైభాగన విశాలమైన మైదానం ఉంది. అక్కడే పెద్ద సరస్సు, కింది వైపు నాగేశ్వరి గుహలు ఉన్నాయి. వీటిని తిలకించడానికి నిత్యం పర్యాటకులు తరలి వస్తుంటారు. మరోవైపు గుహల్లోని బాక్సైట్‌ను తవ్వేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. వీటిని వ్యతిరేకిస్తూ గిరిజనులు పోరాటాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడికి ప్రవేశాలు నిషేధిస్తూ 2 నెలలు క్రితం స్థానికులు పెద్ద గేటు బిగించారు. దీనివల్ల గంజాయి స్మగ్లర్లకు కూడా ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో గేటు చోరీ కావడం గమనార్హం. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మంచినీటికి బదులు మురుగునీరు సరఫరా!



కుళాయిల ద్వారా వస్తున్న మురుగు నీరు



తుంబర్లలో ప్రజారోగ్య శాఖ మంచినీటి విభాగం

కొరాపుట్: ప్రజారోగ్య శాఖ పంపిణీ చేస్తున్న మంచి నీటికి బదులు మురుగు నీరు (ఎర్రటినీరు) వస్తుంది. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి తుంబర్ల గ్రామ పంచాయతీ దన్సులి గ్రామంలో మంచి నీటికి బదులు మురుగు నీరు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. గత కొద్ది రోజులుగా ఈవిధంగా దుర్గంధంతో కూడిన నీరు సరఫరా అవుతున్నటుట స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని సర్పంచ్ దృష్టికి తెచ్చారు. సర్పంచ్ ఉన్నతాధికారులకు నివేదించినా వారు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయం గురువారం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో అధికారులు గ్రామానికి పరుగులు తీసి దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

గజపతి స్టేడియంలో వికాస్ మేళా నేడు



వికాస్ మేళా వేదిక

పర్లాకిమిడి: గజపతి స్టేడియంలో ఏర్పాటు చేసిన వికాస్ మేళాను మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శనివారం ప్రారంభించనున్నారు. ముందుగా బరంపురం నుంచరి పర్లాకిమిడి సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని వికసిత్ జిల్లా.. వికసిత్ ఒడిషా కార్యక్రమంలో పాల్గొంటారు. వికాస్ మేళాలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారులకు ప్రశంసాపత్రాలు, చెక్కులు పంపిణీ చేస్తారు. ఈ నెల 20 వరకూ వికాస్ మేళా కొనసాగనుంది.

విద్యుదాఘాతంతో యువకుని మృతి



రంజన్ కుమార్ మృతదేహం

రాయగడ: విద్యుత్‌షాకతో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన జిల్లాలోని బిసంకటక్ సమితి హజారిడంగ్ గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. మృతుడు రంజన్ కుమార్ సాహుకార్ (22)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బిసంకటక్ కోర్టులో ఏపీఆర్‌గా విధులు నిర్వహిస్తున్న రంజన్‌కుమార్ ఎప్పటిలాగే ఉదయం స్నానం చేసిన తరువాత ఇనుప తీగకు సమీపంలో ఉన్న తువ్వాలను శరీరం తుడుచుకోవడానికి తీసుకుంటుండగా విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయారు. అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్కన్‌గిరి పూర్వ కలెక్టర్‌కు బెయిల్



కోర్టుకు హాజరైన మనీష్‌కుమార్ అగర్వాల్

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా పూర్వ కలెక్టర్ మనీష్‌కుమార్ అగర్వాల్‌కు ఎస్‌డీజేఎం కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. 2019లో మనీష్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఆయన వద్ద పీఏగా ఉన్న దేవనారాయణ్ పండా ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆయన భార్య వనజ పండా తన భర్తను కలెక్టర్, మరో ముగ్గురు సిబ్బంది కలిసి హత్య చేశారంటూ మల్కన్‌గిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాద్ చేసింది. ఆ కేసులో మనీష్‌కు బెయిల్ మంజూరైంది.

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ



కల్లేపల్లి ఈశ్వరమ్మ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని పీఎన్‌కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలో చైన్ తెంపేసి బైక్‌పై ఉడాయించాడు ఓ యువకుడు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పీఎన్ కాలనీ మూడో లైన్ కమల నివాస్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కల్లేపల్లి ఈశ్వరమ్మ (62) తన సోదరితో కలసి ఫ్రెండ్స్ కాలనీలో బంధువులు చనిపోవడంతో పరామర్శకు వెళ్లారు. శుక్రవారం రాత్రి తిరిగి పీఎన్‌కాలనీ రెండో లైన్ చేరేసరికి ఓ 30 ఏళ్ల యువకుడు తలకు హెల్మెట్ ధరించి రయ్‌మని దూసుకొచ్చి నడుస్తున్న వృద్ధురాలి మెడలో మూడు న్నర తులాల చైన్ తెంపేసి వెళ్లిపోయాడు. దీంతో ఆమె మెడకు గాయమైంది. దీనిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పీఎన్ కాలనీలో వరుసగా చోరీలు, చైన్ స్నాచింగ్‌లు జరుగుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తెలతాడు చోరీకి విఫలయత్నం

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం గ్రామానికి సమీపంలో అదే గ్రామానికి చెందిన గేదెల మహాలక్ష్మి అనే మహిళ రహదారి నుంచి గ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో పుస్తెలతాడు తెంపుకు వెళ్లే ప్రయత్నం చేశాడు. శుక్రవారం మహాలక్ష్మి పెద్ద లక్ష్మీపురం గ్రామానికి తన తండ్రి పెద్దకర్మకు వచ్చి తిరుగు ప్రయాణంలో గోకర్ణపురం గ్రామానికి వెళ్తుండగా..ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనం పై వచ్చి మెడలో పుస్తెలతాడు లాగే ప్రయత్నం చేశారు. మహిళ కేకలు వేయడంతో వారు పారిపోయారు. అనంతరం మహిళ మెళియాపుట్టి పోలీసులకు సమాచారం అందించారని తెలియజేశారు.

పిడుగుపాటుకు నాలుగు ఆవులు మృతి

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడుమూరు గ్రామంలో శుక్రవారం ఒంటిగంట సమయంలో ఉరుములతో కూడిన వర్షానికి చెట్టుమీద పిడుగుపడి కిందనున్న నాలుగు ఆవులు మృతి చెందాయి. ఇదే గ్రామానికి చెందిన పిట్ట అప్పయ్య ఓ చెట్టు కింద ఆవులు కట్టి ఉంచారు. ఒక్కసారిగా పిడుగుపడి ఆవులు మృతిచెందడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. రెవెన్యూ సిబ్బంది, పశువైద్యాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.



వికాష్ మేళాను ప్రారంభిస్తున్న ఎంపీ భోలభద్ర మాఝి



గిరిజన స్టాల్‌లో అతిథులు



వేదికపై అతిథులు



స్టాల్‌ను సందర్శిస్తున్న ఎంపీ

వికాస్ మేళా ప్రారంభం

మల్కన్‌గిరి : ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా మల్కన్‌గిరి డీఎన్‌కే క్రీడా మైదానంలో గురువారం వికాష్ మేళాను నవరంగ్‌పూర్ ఎంపీ బోలభద్ర మాఝి ప్రారంభించారు. ఏడాదిగా అమలు చేస్తున్న అంత్యోదయ్ గృహ నిర్మాణ యోజన, ప్రధాన మంత్రి జన్మస్ యోజన, సామాజిక సహాయ యోజన , మధు యోజన, గిరిజన తొమ్మిదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు షహీద్‌మద్ సింగ్ హాత్ ఖర్చు యోజన తదితర పథకాలతో అనేక మంది లబ్ధి పొందారని ఎంపీ వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ సభ ోర, జిల్లా అదనపు ప్రాజెక్ట్ ఆఫీసర్ మనాస్ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు కంటి పరీక్షలో శిక్షణ

- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి



ఎస్‌ఐడబ్ల్యూసీ వర్గీయులతో గవర్నర్ సమావేశం

భువనేశ్వర్: పిల్లల ఆరోగ్య సంరక్షణ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ప్రధానంగా రక్త హీనత, దృష్టి సమస్యలపై ప్రత్యేక జాగ్రత్త అవసరమని, ఈ నేపథ్యంలో పిల్లల్లో కంటి చూపు లోపాల్ని ఆరంభ దశలో గుర్తించేందుకు వీలుగా ప్రాథమిక పాఠశాలలో కనీసం ఒక ఉపాధ్యాయునికి ప్రాథమిక కంటి పరీక్షలో శిక్షణ కల్పించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రతిపాదించారు. స్థానిక రాష్ట్ర మహిళా, పిల్లల సంస్థ (ఎస్‌ఐడబ్ల్యూసీ)ను సందర్శించిన సందర్భంగా మహిళలు, కౌమారదశలో ఉన్న బాలికలలో రక్త హీనత, పిల్లలలో పెరుగుతున్న దృష్టి సమస్యలపై గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు.

హిమోగ్లోబిన్ స్థాయిలను మెరుగుపరిచేందుకు క్రమం తప్పకుండా పరీక్షలు, రోజువారీ ఆహారంలో క్యారెట్-బీట్‌రూట్ రసం, చిక్కీ వంటి పోషకాహార పదార్థాలను చేర్చాలని గవర్నర్ సూచించారు. పాఠశాల పిల్లలలో కంటి చూపు సమస్యల పెరుగుతున్న ప్రాబల్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ముందస్తుగా గుర్తించేలా ప్రతి పాఠశాలలో కనీసం ఒక ఉపాధ్యాయుడికి ప్రాథమిక కంటి పరీక్షలో శిక్షణ ఇవ్వాలని డాక్టర్ కంభంపాటి ప్రతిపాదించారు. అన్ని సంబంధిత విభాగాలతో ఈ సమస్యలను వీలైనంత త్వరగా చర్చిస్తానని కూడా ఆయన హామీ ఇచ్చారు.

ఎస్‌ఐడబ్ల్యూసీ సముదాయంలో మాలతి చౌదరి నివాస్, రెసిపీ అండ్ టొయాథాన్ డెమోన్‌స్ట్రేషన్ యూనిట్, ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం, యోగా కేంద్రం, లైబ్రరీతో సహా సౌకర్యాలను గవర్నర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణార్థులతో సంభాషించి వారి శిక్షణ, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకాలకు వారి ప్రాప్యత గురించి కూడా ఆయన వారిని అడిగారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల యొక్క అన్ని ప్రజానుకూల పథకాలను జాబితా చేసే బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలని గవర్నర్ సూచించారు. వీటిని ట్రైనీలకు పంపిణీ చేయాలని తెలిపారు. పర్యటన సందర్భంగా మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రముఖ కార్యదర్శి శుభ శర్మ, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు.



రోజువారీ పౌష్టికాహార పదార్థాల పరిశీలిస్తున్న రాష్ట్ర గవర్నర్



ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో గవర్నర్

75 మందికి సామాజిక బహిష్కరణ



నబరంగ్‌పూర్ ఎస్పీ కార్యాలయం వద్ద బాధితులు

కొరాపుట్: ఆధునిక సమాజం ఎంత ముందుకు వెళ్తున్నా ఇంకా కొన్ని గ్రామాల్లో గిరిజనులు మూఢ విశ్వాసాలు, నిబంధనలు వీడటం లేదు. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా కొడింగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంకులి గ్రామానికి చెందిన 15 కుటుంబాల పెద్దలు నబరంగ్‌పూర్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. చట్టపరంగా ఉన్న తమ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, దీనిపై న్యాయ పోరాటానికి దిగడంతో కక్ష కట్టి తమ 15 కుటుంబాలకు చెందిన 75 మందిని సామాజిక బహిష్కరణ చేశారని వాపోయారు. గ్రామంలో ఎవరూ తమతో మాట్లాడరని, దుకాణాలలో వస్తువులు విక్రయాలు చేయడం లేదని, బోర్ల వద్ద నీరు పట్టుకోనివ్వడం లేదని, కనీసం పశువులను కూడా చెరువుల వద్దకు రానివ్వకపోవడంతో నాలుగు రోజులుగా పశువులు ఆకలితో అలమటిస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. తమ పిల్లలను కూడా ఇతర పిల్లలతో ఆడనివ్వడం లేదన్నారు. గ్రామస్తులు ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే రు.500 జరిమానా విధిస్తున్నారని చెప్పారు. ఈ విషయమై కొడింగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదన్నారు. సమాచారం అందుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మన్నా త్రిపాఠి బాధితులను జిల్లా కేంద్రానికి రప్పించి ఎస్పీ ఫిర్యాదు చేయించారు. దీంతో ఎస్పీ సందీప్ సంపత్ తీవ్రంగా పరిగణించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, మున్నా త్రిపాఠి మీడియాతో మాట్లాడుతూ ఇటువంటి సంస్కృతిని ఆదిలోనే నిలిపి వేయాలన్నారు. లేదంటే ప్రతి గ్రామంలో బలవంతులు చట్టం తమ చేతిలోకి తీసుకొని పేదలను పీడిస్తారన్నారు. తక్షణం పోలీసు బలగాలు గ్రామానికి చేరుకొని నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఆ గ్రామాన్ని సందర్శిస్తామని త్రిపాఠి పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల గ్రామానికి చెందిన గురువిల్లి అసిరయ్య (79) ఈ నెల 11వ తేదీన చెరువు పనికి వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు జేఆర్ పురం పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అసిరయ్య బుధవారం చెరువు పనికి వెళ్లి ఉదయం 11 గంటలకు చెరువు పని ముగించుకుని బహిర్భూమికి వెళ్లారు. తదుపరి చెరువు తుప్పలో పడి ఉన్న విద్యుత్ వైరును గమనించకుండా తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎవరూ గమనించకపోవడంతో ఆయన కోసం రెండు రోజులు వెతికారు. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు వృద్ధుడు విద్యుత్ షాక్‌తో చనిపోయినట్లు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. భార్య అప్పయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ ఎస్. చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఉద్దానంలో 'జీడి బోర్డు' ఏర్పాటు చేయాలి

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన రైతులు జీవనాధారమైన జీడి పంటకు మద్దతు ధర కల్పించి స్థానికంగా జీడి బోర్డు ఏర్పాటు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాతుపురంలో శుక్రవారం రైతు సంఘ నాయకులు, ఉద్దాన రైతులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహన్‌రావు, జీడి రైతు సంఘ జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను విస్మరించి విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం సిగ్గు చేటన్నారు. జీడి పప్పు ధరలు మార్కెట్‌లో బాగానే ఉన్నప్పటికీ జీడి వ్యాపారులు దురాశతో జీడి పరిశ్రమలకు లాకౌట్ ప్రకటించడం దారుణమని అన్నారు. జీడి రైతులను ఆందోళనకు గురి చేసి వారి నుంచి కారుచౌకగా జీడి పిక్కలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో పలు మార్లు జీడి మద్దతు ధర అంశంపై లేవనెత్తినప్పుడు సంబంధిత శాఖా మంత్రి అచ్చెన్నాయుడు ఎలాంటి సమాధానం చెప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో జీడి రైతు సంఘ నాయకులు కె.రమేష్,ఎం.కామేశ్వరరావు,మద్దు రాఘవరావు,అర్లి దానేస్, ఉప్పరపల్లి ఢిల్లీ రావు, రెయ్యి మంజు, దాసరి మోహన్‌రావు, సీహెచ్ భాస్కరరావు, చిరంజీవి ఉన్నారు.

నేడు ఉత్తరాంధ్ర గ్రంథాలయ సదస్సు

శ్రీకాకుళం కల్చరల్: గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో భాగంగా ఈనెల 14న విశాఖ పౌర గ్రంథాలయంలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు జరుగుతుందని జిల్లా కన్వీనర్ బుడుమూరు సూర్యారావు, కో కన్వీనర్ డాక్టర్ జామి భీమశంకర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్స్‌లర్ ఆచార కేఎస్ చలం అధ్యక్షతన జరిగే సదస్సుకు రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆచార్య చలంతో పాటు జి.నాగేశ్వరరావు (ఆంధ్రా విశ్వవిద్యాలయం), ఆచార్య సుదర్శన్ రొక్కం (విక్రమ్ సింహపురి విశ్వవిద్యాలయం), వై.సత్యనారాయణ (దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం), డాక్టర్ హెచ్.లజపతి రాయ్ (బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం) హాజరవుతారని పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల గంజాయి స్వాధీనం

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో వేర్వేరు చోట్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి కార్యాలయం సమీపంలో పోలీసులు తనిఖీ చేశారు. ఆర్‌జే 08 జీఏ 4204 నంబర్ గల ట్రక్‌ని ఆపి డ్రైవర్ పరారయ్యాడు. అందులో సురుమి గ్రామానికి చెందిన మోహనరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వాహనం తనిఖీ చేయగా 1084 కిలోల గంజాయి దొరికింది. స్టేషన్ అధికారిణి మమతా పండా కేసు నమోదు చేసి, గంజాయితో పాటు నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

జయపూర్ నుంచి విశాఖ పట్నం వెళ్తున్న కిరండోల్ రైలులో కొరాపుట్‌లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ముగ్గురు మహిళా ప్రయాణికుల బ్యాగ్‌లలో 30 కిలోల గంజాయి దొరికింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వారు గంజాయి స్మగ్లర్లని తేలింది. దీని విలువ రూ.3 లక్షలు ఉంటుందని పోలీసులు ప్రకటించారు. ముగ్గురు నిందితురాళ్లు న్యూఢిల్లీకి చెందిన షర్మిలా,మౌనిక,రాధికగా పేర్కొన్నారు. ఈ గంజాయి విశాఖ నుంచి న్యూఢిల్లీ తీసుకెళ్తున్నట్లు తెలిపారు.



నందపూర్ పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు



కొరాపుట్ పోలీస్ స్టేషన్‌లో మహిళా గంజాయి స్మగ్లర్లు



కొరాపుట్ రైల్వే స్టేషన్ లో పట్టుబడిన గంజాయి

అపోహలు వీడుదాం..

ఆర్తులను కాపాడుదాం

- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం
- జిల్లాలో తగ్గుతున్న రక్త నిల్వలు
- దాతలు ముందుకు రావాలని స్వచ్ఛంద సంస్థల పిలుపు

జిల్లాకు ఏడాదికి దాదాపు 60వేల యూనిట్ల రక్తం అవసరమవుతుంది. కానీ సేకరిస్తున్నది మాత్రం కేవలం 16 యూనిట్లే. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దడం చిటికెలో పని. కానీ ఎందుకనో ఆ పని జరగడమే లేదు. దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేస్తే కొరతను ఇట్టే అధిగమించవచ్చు. కానీ అవగాహన లేమి, భయం, సమాచార లోపం కారణంగా రక్తదానం చేసేందుకు చాలా మంది ముందుకు రావడం లేదు. ఈ భయం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం అందకుండాపోతోంది.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: దాతలు కావాలి.. రక్త దాతలు ముందుకు రావాలి. జిల్లాలో రక్తల నిల్వలు నానాటికీ తక్కువైపోతున్నాయి. దాతలు ముందుకు రాకపోతే గర్భిణుల దగ్గర నుంచి ప్రమాద బాధితుల వరకు చాలా మంది ప్రాణాపాయ స్థితిలో పడతారు. రక్తదానంపై అవగాహన విస్తృతంగా పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

జిల్లాలో రెడ్‌క్రాస్‌తో పాటుగా ప్రభుత్వ ఆస్పత్రులు, జిల్లా కేంద్రంలో 3 ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో బ్లడ్‌బ్యాంకులు ఉన్నాయి. వాటన్నింటి ద్వారా రక్త సేకరణ ఏడాదిలో కేవలం 16వేల యూనిట్లు మాత్రమే జరుగుతోంది. జిల్లాకు దాదాపు 60వేల యూనిట్లు అవసరం ఉంటుంది. దీనిపై రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సి ఉందని చెప్పారు. తమ బ్లడ్‌బ్యాంకులో కూడా కూడా రక్తం అందడం కష్టంగా ఉందన్నారు.

ఎవరు రక్తదానం చేయవచ్చు..

కాసింత దయాగుణం.. మరికాసింత ఆరోగ్యం.. ఈ రెండూ ఉంటే చాలు.. 18–60 ఏళ్ల వారెవరైనా 45 కిలోలకు పైగా బరువు ఉండి, 12 పాయింట్లు హిమోగ్లోబిన్ ఉంటే ఎంచక్కా రక్తదానం చేయవచ్చు.

అపోహలు వద్దు..

- చాలా మంది రక్తదానం అంటే భయపడతారు. దీనిపై చాలా అపోహలు ఉన్నాయి.
- రక్తదాన ప్రక్రియలో కేవలం 300 మిల్లీలీటర్లు మాత్రమే సేకరిస్తారు.
- సాధారణంగా మనిషిలో సరాసరి 5లీటర్ల నుంచి 6లీటర్ల రక్తం ఉంటుంది. కేవలం 300 మిల్లీలీటర్ల రక్తం దానం చేయడం వల్ల ఎలాంటి ప్రమాదం లేదు. సుఖప్రసవంలో తల్లి 700 మిల్లీలీటర్ల రక్తం కోల్పోతుంది.

నేడు రక్తదాతల దినోత్సవం

రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు రక్తదానంపై ఆవశ్యకత కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. రక్తదాన శిబిరాలను కూడా నిర్వహిస్తారు.

ప్రతి మూడు నెలలకు ఇస్తాను..



నేను ప్రతి మూడు నెలలకు ఓ సారి రక్తదానం చేస్తుంటాను. మొదట్లో నాకూ భయం ఉండేది. మా మేనేజర్‌ను చూసి స్ఫూర్తి పొందాను. రెడ్‌క్రాస్ పలుసార్లు అవార్డులు, సత్కారాలు కూడా చేశారు.

– సీహెచ్ రమణమూర్తి, శ్రీకాకుళం

సాటి మనిషిని కాపాడాలనే..



నేను 49 సార్లు రక్తదానం చేశాను. ఏటా ఆగస్టు 15, మే 1, రిపబ్లిక్ డే, డిసెంబరు 25 పుట్టిన రోజున ఇస్తుంటాను.

– కేవీవీ పురుషోత్తమరావు(కల్యాణ్), విశ్రాంత మెడికల్ రిప్రజెంటేటివ్, శ్రీకాకుళం

అపోహలు వదలండి



రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి. ఎవరైనా రక్తదానం చేయవచ్చు. ఆపద సమయంలో రక్తం ఎంతో అవసరం . దాన్ని గుర్తించండి.

– పి.జగన్మోహనరావు, చైర్మన్, రెడ్‌క్రాస్

పరికరాలు ఉన్నా..

ప్రయోజనం సున్నా

- టెక్కలి జిల్లా ఆస్పత్రిలో సమస్యల కొలువు
- వేధిస్తున్న స్టాఫ్ నర్సుల కొరత

టెక్కలి రూరల్:

స్థానిక జిల్లా కేంద్రాస్పత్రి సమస్యలతో కునారిల్లుతోంది. నిత్యం 700 వరకు ఓపీ ఉన్న ఈ ఆస్పత్రిలో సరైన వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఇక్కడ చర్మవ్యాధి నిపుణులు లేకపోవడంతో చాలా మంది ఇక్కట్లు పడున్నారు. ఆస్పత్రిలో ప్రధానంగా స్టాఫ్ నర్సుల కొరత వేధిస్తోంది. గత ప్రభుత్వంలో స్టాఫ్ నర్సులు 43 మంది ఉండగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 కంటే తక్కువ మందే పనిచేస్తున్నారు. దీంతో ట్రామాకేర్, గైనిక్ వార్డు, జనరల్ వార్డులు, ఆర్థో వార్డుల్లో రోగులకు సరైన సమయంలో వైద్యం అందించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.



ఆస్పత్రిలో స్టాఫ్ నర్సులు తగినంత మంది లేక ఇబ్బందులు పడుతున్న రోగులు



రసాయనాలు లేక నిరుపయోగంగా మారిన థైరాయిడ్ పరికరం

ప్రధాన సమస్యలివే..

- ఆస్పత్రిలో రేడియోలజిస్టు లేక అల్ట్రా సౌండ్ స్కానింగ్ విభాగం మూతపడింది.
- రూ.లక్షలు విలువ గల వెంటిలేటర్లు ఉన్నా, వినియోగించేందుకు నిపుణులు లేక అవి కూడా మూలకు చేరాయి.
- రూ.లక్షలు విలువ గల హార్మోన్ ఎనలైజర్ యంత్రం ఉన్నా, దానికి సంబంధించిన రసాయనాలు లేక వినియోగంలో లేకుండా పోయింది.
- ఈసీజీ టెక్నీషియన్ లేకపోవడంతో ఉన్న సిబ్బందితో పూర్తిస్థాయి అవగాహన లేకుండా ఈసీజీ ప్రక్రియ నిర్వహిస్తున్నారు.
- థైరాయిడ్ పరీక్షలకు సంబంధించిన యంత్రం ఉన్నా దానికి సంబంధించిన కెమికల్స్ లేకపోవడంతో థైరాయిడ్ పరీక్షలకు అక్కడ ఉన్న కొంతమంది సిబ్బంది బయట ల్యాబ్‌లతో మాట్లాడి చేయిస్తున్న పరిస్థితి నెలకొంది.
- ట్రామాకేర్‌కు సంబంధించిన అంబులెన్స్ పాత జిల్లా ఆస్పత్రి ఆవరణలో మూలకు చేరింది.
- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగి నెలలు గడుస్తున్నా నేటికీ నిర్వహించడం లేదు. దీంతో చాలా వరకు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఆస్పత్రికి పూర్తిస్థాయిలో దోబీ వర్కర్ లేకపోవడంతో శానిటేషన్ వర్కర్లతో పనిచేయిస్తున్నారు.
- ఆస్పత్రిలో సరిపడా వీల్‌చైర్లు, స్ట్రెచర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.
- ఆస్పత్రిలో ఉన్న లిఫ్ట్ తరుచూ పాడైపోతోంది.
- రోగులకు అవసరమైన తాగునీరు, వాడుకనీరు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు.
- కాలువ వ్యవస్థ కూడా సరిగా లేదు.
- ఫ్రీజర్లు సరిగా లేకపోవడంతో మృతదేహాలను కిందనే ఉంచాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

స్టాఫ్‌నర్సుల కొరత వాస్తవమే..

ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుల కొతర వాస్తవమే. 17 మంది తక్కువగా ఉన్నారు. బదిలీలు జరిగాక కొత్త వారు వస్తారు. థైరాయిడ్, వెంటిలేటర్ పరికరాలు త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తాం.

– బొడ్డేపల్లి సూర్యారావు, టెక్కలి జిల్లా ఆస్పత్రి సూపరిండెంటెంట్

క్లుప్తంగా

ఆటో బోల్తా పడి ఇద్దరు మహిళలకు గాయాలు



ఆటో ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన సావిత్రి

చీపురుపల్లి: పట్టణంలోని రాజాం రోడ్‌లో వెదుళ్లవలస జంక్షన్ వద్ద ఆటో బోల్తా పడడంతో ఇద్దరు మహిళలకు గాయలయ్యాయి. ఇద్దరిలో సవరపు సావిత్రికి తీవ్రగాయాలు కాగా గుంప సావిత్రికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం చీపురుపల్లి నుంచి రాజాం వెళ్తున్న ఆటోలో గరివిడి మండలానికి చెందిన సవరపు సావిత్రి, విజయనగరానికి చెందిన గుంప సావిత్రితో పాటు మరికొంత మంది ప్రయాణికులు ఉన్నారు. రైల్వేస్టేషన్ దాటిన తరువాత వెదుళ్లవలస జంక్షన్ వద్ద ఎదురుగా మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనం రావడాన్ని గుర్తించిన ఆటో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా కొట్టింది. దీంతో బొండపల్లికి చెందిన సవరపు సావిత్రి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అలాగే విజయనగరానికి చెందిన గుంప సావిత్రికి స్వల్ప గాయలయ్యాయి. దీంతో ఆ ఇద్దరినీ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం తీవ్ర గాయాల పాలైన సవరపు సావిత్రిని అత్యవసర వైద్యం నిమిత్తం విజయనగరం రిఫర్ చేశారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో పేకాట రాయళ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. తమకు వచ్చిన ముందస్తు సమాచారంతో ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి..స్థానిక సీత చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8,860 నగదు సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో పేకాట, కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

ఏగోటివలస పొలాల్లో ఏనుగుల గుంపు

సీతానగరం: మండలంలోని కోట సీతారాంపురంలో నాలుగు రోజులుగా తిష్టవేసిన ఏనుగుల గుంపు శుక్రవారం ఏగోటివలస పొలాల్లో సంచరిస్తున్నాయని గ్రామస్తులు తెలియజేశారు. కోట సీతారాంపురం గ్రామానికి వచ్చిన 8 ఏనుగుల గుంపు 9కి చేరడంతో తాజాగా 9 ఏనుగుల గుంపు ఏగోటివలస పొలాల్లో సంచరిస్తున్నాయి. కోటసీతారాంపురం రైతు కె.రత్నాకర్ పొలంలో మొక్కలు ధ్వంసం చేయడంతో నష్టం వాటిలిందని తెలియజేశారు. ఇక్కడి పొలాల్లో ఏనుగులు ఏమేరకు నష్టాల్ని తెస్తాయోనని చెరకు, మామిడిరైతులు ఆందోళన చెందుతున్నారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సారా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జియ్యమ్మవలస మండలం చినబుడ్డిడి గ్రామ సమీపంలో నిర్వహించిన దాడుల్లో ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల సారాను తరలిస్తున్న ఓ వ్యక్తి పట్టుబడినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు తన కార్యాలయం వద్ద సీఐ విలేకరులతో మాట్లాడుతూ పట్టుబడిన వ్యక్తికి సారాను సరఫరా చేసిన మరో వ్యక్తిని కూడా త్వరలో అరెస్ట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జియ్యమ్మవలస మండలంలో గల పెదతుంబలి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా గ్రామ కమిటీ తీర్మానం మేరకు ప్రకటించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఏజెన్సీలో ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



విజయనగరం అర్బన్: గిరిజన ప్రాంతాలలో రేషన్ సరఫరాను పాత ఎండీయూ విధానంలో కొనసాగించాలని, లేదంటే ప్రత్యేక రేషన్ డిపోలను ఏర్పాటుచేసి సరుకులు సరఫరా చేయాలని రాష్ట ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ తీసుకోవడంలో గిరిజనుల ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందిస్తూ శుక్రవారం మాట్లాడారు. ప్రస్తుతం రేషన్ తీసుకోవడంలో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయి కమిషనర్‌కు ఎస్టీ కమిషన్ లేఖ రాసిందన్నారు. ఏజెన్సీ ప్రజలు ఆహార భద్రతకు దూరంగా ఉన్న పరిస్థితులున్నాయని, ఈ నేపథ్యంలో ఎండీయూ విధానాన్ని ఆపడంవల్ల ప్రభుత్వం అందించే సరుకులు తీసుకునేందుకు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు. గిరిజనుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఏజెన్సీ ప్రాంతాలతో పాటు ఎండీయూ విధానాన్ని కొనసాగించాలని డాక్టర్ శంకరరావు కోరారు.

అస్తవ్యస్తంగా వరద కాలువలు

- నిలిచిపోయిన కల్వర్టుల నిర్మాణం
- ఆందోళనలో రైతులు

పార్వతీపురం రూరల్: ఓ వైపు వాతావరణంలో మార్పులు సంభవించి వానలు ముంచుకొస్తున్నప్పటికీ అధికారుల్లో మాత్రం కదలిక కనిపించడం లేదు. ఎక్కడ చూసినా పంట కాలువలు పూడికలతో నిండిపోయి వర్షం కురిస్తే వరదనీరు కాలువల ద్వారా చెరువుల్లోకి పారేందుకు ఆస్కారం లేకుండా అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. ఉపాధిహామీ పథకంలో పూడిక తీత వంటి పనులు చేపట్టే వెసులుబాటు ఉన్నా జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఆ ఊసే లేకుండా పోయింది. సంబంధిత అధికారులు ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోనప్పటికీ ఏ ఛానల్లో ఎంత పరిధి నిధులు అవసరమన్నది ఉపాధి, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ప్రతిపాదనలు చేసి ఇప్పటికే పనులు పూర్తిచేయాలి. కానీ వాటి జోలికే అధికారులు వెళ్ల లేదు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన లంకెల చెరువు కల్వర్టు పనులు

ఎక్కడ చూసినా అధ్వానమే

జిల్లాలో చాలా వరకు పంటలకు ఆధారమైన పంట కాలువలు పూడికలతో నిండిపోయి వాటి ఆనవాళ్లే లేకుండా మారాయి. ప్రధానంగా చెరువులైతే వాటి విస్తీర్ణం తగ్గి బక్కచిక్కిన దుస్థితిలో దర్శనమిస్తున్నాయి. వాటికి సంబంధించిన భూములు కూడా శిథిలమయ్యాయి. గతంలో కూడా పనులు సక్రమంగా చేపట్టక వాటి లైనింగ్ పనులు పూర్తిగా పాడై పంట సాగుకు నీరు పారని దుస్థితిలో ఉన్నాయి. ఇప్పటికే వాటి పనులు జరిగి ఉంటే రైతులకు సాగు నీటికి ఇబ్బంది ఉండేది కాదు. నాలుగు వారాల్లో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ ఎక్కడా పనులు ప్రారంభించిన దాఖలాలు కన్పించడం లేదు.



తుప్పలు, దొంకలతో నిండి ఆనవాలు మారిన కాలువ

గిరిజన ప్రాంతాల్లో ఇదే దుస్థితి

జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో దాదాపుగా వందల కొద్దీ చెక్‌డ్యాంలు గతంలో నిర్మించారు. వాటితో గిరిజన రైతుల ఆయకట్టు భూమికి పుష్కలంగా సాగునీరు అందేది. సమీపంలో ఉన్న వాగుల ద్వారా చెరువులు, గెడ్డలు నిండి వాటి ద్వారా పంటలకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ జరిగేది. ఈ క్రమంలో వేసవిలో కూడా గిరిజన రైతులు పంటలు పండించుకునేందుకు ఆస్కారం ఉండేది. కొన్నేళ్లుగా వాటివైపు చూసే నాథుడే లేక అలాగే చెక్‌డ్యాంల నిర్వహణ మరమ్మతులు జరగక కాలువల్లో పూడికలు పేరుకుపోయి రైతులను ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికిప్పుడు భారీ వర్షాలు కురిస్తే నీరు వృథాకావడమే కాకుండా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ భూముల సైతం ముంపు బారిన పడక తప్పదని ఆప్రాంత గిరిజనులు వాపోతున్నారు.



గుమ్మలక్ష్మీపురం మండలంలో గాంధ్ర గెడ్డ చెక్ డ్యాం శిథిలావస్థకు చేరడంతో నీరు వృథా పోకుండా అడ్డుకట్ట వేస్తున్న రైతులు

అలసత్వంతో అవినీతి

జిల్లా వ్యాప్తంగా ఉన్న నీటి ప్రాజెక్టులకు సంబంధించిన పంటకాలువల్లో పూడికలు తీసే పనులు జనవరి నుంచి మే మాసం లోపే అధికారులు పూర్తి చేసి వర్షాకాలానికి సన్నద్ధం కావాలి. ఈ పనులేవీ చేయకుండా వర్షాకాలం వచ్చిన తరువాత నిధులు కేటాయించి కాలువల్లో వరదనీరు ఉంటుంది కాబట్టి ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఆ నిధులను దుర్వినియోగం చేసేందుకు అధికారులు కుట్ర పన్నుతున్నారన్న ఆరోపిణలు వినిపిస్తున్నాయి. ఇటీవల తోటపల్లి కాలువకు సంబంధించిన పనుల్లో ఓ అధికారి పనులు నిర్వహించకుండానే ఎం బుక్‌లు చేసి నిధులు ఏవిధంగా తారుమారు చేశారో తెలిసిందే. ఇదే వైఖరిని అధికారులు కొనసాగిస్తున్నారు.



– ఎం.కృష్ణమూర్తి, రైతుసంఘం నాయకుడు

విద్యుత్‌షాక్‌తో లైన్‌మన్ మృతి



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన జూనియర్ లైన్‌మన్ రహ్మాన్

శృంగవరపుకోట: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఆ శాఖలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మన్ మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం జామి మండలంలోని సోమయాజుల పాలెం గ్రామంలో జరిగింది. శాసనాపల్లి సచివాలంయలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ రహ్మాన్ శుక్రవారం సోమయాజులపాలెంలో విద్యుత్ పోల్ ఎక్కి మరమ్మతులు చేస్తుండగా, ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి కింద పడిపోయాడు, విద్యుత్ సిబ్బంది హుటాహుటిన విజయనగరంలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఉద్యోగం వచ్చిందని, కుటుంబానికి ఆసరాగా కొడుకు ఉన్నాడని, మురిసిపోయామని, తమ ఆనందం మూడు రోజులు ముచ్చటే అయ్యిందని, ఇక తమకు దిక్కెవరంటూ మృతుడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించడం గ్రామస్తులను కలిచివేసింది.

చికిత్స పొందుతూ వృద్ధుడు..



చికిత్స పొందుతూ మృతి చెందిన అప్పారావు (ఫైల్)

లక్కవరపుకోట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నంలో గల కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన పెదగాడ అప్పారావు(77) శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 9వ తేదీన ఎల్.కోట జంక్షన్ నుంచి అప్పారావు సోంపురం వెళ్తుండగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన అప్పారావును విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రక్తదానం జీవనదానమే

విజయనగరం: యవత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని విజయనగరం రెడ్ క్రాస్‌సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో విజయనగరం ఫోర్ట్ క్యాంపస్‌లో గల స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన రక్తదాన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఒక వ్యక్తి ఎక్కువమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. దాత నుంచి సేకరించిన బ్లడ్‌ను హోల్ బ్లడ్ అని పిలుస్తారని, దానిని ప్లాస్మా, ప్లేట్‌లెట్స్‌గా విడదీసి ఇతరులకు రక్తాన్ని వినియోగిస్తారని చెప్పారు. రక్తదానం జీవనదానమే కాబట్టి ఈ విషయంపై నేటి యువత శ్రద్ధ పెట్టి రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీఎస్‌ఏ రాజు, ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, సుభద్రాదేవి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె.హరికృష్ణ ప్రసాద్, కేఎస్ఏ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు కల్పించాలి



డీఆర్‌వో హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కమిటీ సభ్యులు

- ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక కమిటీ డిమాండ్
- డీఆర్‌ఓకు వినతి పత్రం అందించిన కమిటీ సభ్యులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో గణనీయమైన సంఖ్యలో గిరిజనులు, పేదలు నివసిస్తున్నారని జిల్లాలో ప్రధానంగా వైద్యానికి ప్రభుత్వ ఆస్పత్రులే ఆధారమని కానీ చాలా ఆస్పత్రుల్లో సరైన మౌలిక వసుతులు లేవని వెంటనే మెరుగుపరచాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అభివృద్ధి వేదిక కమిటీ సభ్యులు ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా జిల్లాలోని సాలూరు, కురుపాం, సీతంపేట, పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించి, వైద్య సదుపాయాలపై రోగులు, ఆయా ఆస్పత్రుల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పర్యటన అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రాన్ని అందించి సమస్యలను వివరించారు. వెంటనే వైద్య సదుపాయాలను మెరుగుపరిచే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఒక బెడ్‌పై ఇద్దరు అంతకంటే ఎక్కువగా..

ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి 150 పడకలకు, సాలూరు ఆస్పత్రి 100 పడకలకు, కురుపాం 50 పడకలకు, భద్రగిరి 50 పడకలకు, సీతంపేట 250 పడకలకు అప్‌డేట్ అయినప్పటికీ భవన నిర్మాణాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీని వల్ల ఒకే బెడ్‌పై ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది పడుకోవలసి వస్తోందన్నారు. అంతే కాక సాలూరులో గైనకాలజిస్టులు ఉన్నా ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి రాలేదని, సాలురులో డాక్టర్ల కొరత కుడా చాలా ఎక్కువగా ఉందన్నారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, అంకాలజీతో సహా అన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చేలా డాక్టర్లను నియమించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు అత్యధికంగా నివసించే ప్రాంతమైన మక్కువ మండలంలోని నంద, దుగ్గేరు, సాలూరు మండలంలోని కురుకూటి, పాచిపెంట మండలంలోని వేటగాని వలస వంటి ప్రాంతాల్లో అదనంగా పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని వివరించారు. కార్యక్రమంలో కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు కె.విజయయగౌరి, వేదిక నాయకులు వెంకటరావు, ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, సీఐటీయూ మన్యం జిల్లా కార్యదర్శి బీవీ రమణ, డీవైఎఫ్ఐ నాయకుడు పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

యోగాంధ్ర పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు

పార్వతీపురం టౌన్: యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమాల్లో బాగంగా జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను పర్యవేక్షించారు. జిల్లాలోని వివిధ మండల,పట్టణ స్థాయి యోగాంధ్ర పోటీల్లో గెలుపొందిన వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో యోగా పోటీలు నిర్వహించామన్నారు.యోగా చిత్రలేఖనం, సాంగ్స్, ఎస్సే, గ్రూప్ యోగా ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. యోగా గురు మోహన్ గంతాయత్ బృందంతో కూడిన ఐదుగురు సభ్యులు జిల్లా స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లా పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందినవారు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్బీఎస్కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, హోమియో వైద్యురాలు డా.సుశీల, జిల్లా కన్సల్టెంట్ డా రఘు,యోగా మాస్టర్స్ మోహన్ గంతాయత్, జనార్దన రావు, డా.హేమాక్షి, డా.వర్మ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో గ్యాంగ్ ఖేల్ ఖతం

- నిందితులు విజయనగరం వాసులు

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాకేంద్రంలో ఇటీవల రెచ్చిపోయిన ఆటో గ్యాంగ్ ఆటను పోలీసులు కట్టించారు. ఈ గ్యాంగ్‌కు సంబంధించి విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..

వృద్ధదంపతులను ఏమార్చి..

ఈ నెల 5న ఎచ్చెర్ల మండలం కొత్తపేట పంచాయతీ సాకివానిపేటకు చెందిన వృద్ధ దంపతులు కోరాడ రమణ, రామలక్ష్మిలు శ్రీకాకుళంలో ఆటోలో ప్రయాణిస్తుండగా పుస్తెలతాడు దొంగిలించారు. అదే రోజు వృద్ధ దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్ఐ రామారావు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం వాహన తనిఖీల్లో భాగంగా తోటపాలెం జంక్షన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ రామారావు, సిబ్బందికి సరిగ్గా ఉదయం పది గంటల సమయంలో ఏపీ 30విడి440 నంబరు గల బజాజ్ మాక్సిమా ఆటో మీద వస్తున్న మహిళలపై అనుమానం కలగడంతో వెంటనే అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెట్టాడ గ్రామానికి చెందిన గొర్లె మౌనిక, గొర్లె పెద్దింట్లమ్మ అదే జిల్లా కొత్తవలస మండలం చీడివలసకు చెందిన ఆటో డ్రైవర్ మేకల హరిలుగా పోలీసులు గుర్తించారు. పెద్దింట్లమ్మ, మౌనికలు తల్లీ కూతుళ్లు కాగా, హరి పెద్దింట్లమ్మకు మేనల్లుడు అవుతాడు.

లెక్కకు మించి కేసులు..

వీరిపై ఇతర జిల్లాల్లో, మన జిల్లాలోని రూరల్‌తో కలిపి పదికి మించి కేసులున్నాయని ఎస్ఐ రామారావు తెలిపారు. వీరిదో గ్యాంగు అని, ఈ కేసుకు సంబంధించి వీరే నిందితులని, గ్యాంగులో మరి కొందరు ఉండొచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. నిందితుల నుంచి ఆటోను, బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరించామన్నారు.

రక్తదాతలు..ప్రాణదాతలే..!

- స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న యువత
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

రాజాం సిటీ:

అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్న, రక్తదానం.. మహాదానం అంటూ ఎన్ని ప్రచారాలు చేసినా, స్పందన మాత్రం కొందరిలోనే కనిపిస్తోంది. రక్తదానం చేయాలని ఉన్నా కొన్ని అపోహలు, మనకెందుకులే అన్న భావనతో చాలా మంది రక్తదానం చేసేందుకు ఇష్ట పడడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండగా, ప్రస్తుతం సేకరిస్తున్న రక్తం ఆపదలో ఉన్నవారికి సరిపోవడంలేదు. విపత్కర పరిస్థితుల్లో మేమున్నామంటూ కొంతమంది రక్తదాతలు ముందుకొచ్చి దానం చేయడంతోపాటు అడపాదడపా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాల్లో పాల్గొంటూ ఆపాయంలో ఉన్నవారిని ఆదుకుంటున్నారు. ఇటువంటి సమయంలో స్వచ్ఛంద సంస్థలు, యువకులు చొరవచూపి రక్తదానానికి ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం.

ప్రాణంతో సమానం..

ప్రమాదాల్లో గాయపడిన వారికి, అత్యవసర చికిత్సలు అవసరమైన వారికి రక్తం ఎంతో అవసరం. రక్తాన్ని ఒకరి నుంచి మరొకరికి అందించాల్సిందే కానీ కృత్రిమంగా తయారుచేయలేం. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానం. ఒకరి రక్తం మరొకరి ఆయుష్షు కాపాడుతుంది. రక్తానికి పేద, ధనిక భేదాలు లేవు. ఒకమనిషి రక్తం మరో మనిషికి అందిస్తేనే వారి ప్రాణాలు నిలుస్తాయన్న సంగతి తెలిసినా చాలా మంది రక్తదానం చేయడానికి భయపడుతున్నారు. కొంతమంది మాత్రం ఎప్పుడు రక్తం అవసరం వచ్చినా మేమున్నామంటూ ముందుకొస్తున్నారు. వారు కూడా రక్తదానం చేయపోతే అత్యవసరమైన వారి పరిస్థితి ఇబ్బందికరమే.



రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

రక్తదానానికి వీరు అర్హులు..

అపోహలు వీడి రక్తదానం చేయాలనుకునేవారు ఆరోగ్యంగా ఉండడంతోపాటు 18 నుంచి 60 ఏళ్ల లోపు వయసు, 50 కిలోల బరువు కలిగిఉండాలి. హిమోగ్లోబిన్ శాతం 12.5 ఉండాలి. చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, ఇతర వ్యాధులు సోకిన వారు నయమైన నాలుగు నుంచి ఆరు నెలల తరువాత రక్తదానం చేయవచ్చు. రక్తదానం చేసేవారి నుంచి కేవలం 300 మిల్లీ లీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.

- రక్తాన్ని సేకరించే ముందు వైద్యులు దాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు.




స్వచ్ఛందంగా 55వ సారి రక్తదానం చేస్తున్న యువకుడు

వీరు అనర్హులు..

- ✔ మధుమేహ వ్యాధి గ్రస్తులు, రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తం ఇవ్వకుండా ఉండాలి. అలాగే గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్నవారు
- ✔ క్యాన్సర్ శస్త్రచికిత్స చేయించుకున్నవారు, గుండెపోటుకు గురైనవారు
- ✔ మూర్ఛవ్యాధి ఉన్నవారు, కంటి జబ్బులు, కంటి కలక వంటివి ఉన్నప్పుడు రక్తదానం చేయవద్దు.


రక్తదానానికి ముందుంటాను..



రక్తదానానికి ఎప్పుడూ ముందుంటాను. ఇప్పటివరకు శిబిరాల ద్వారా, స్వచ్ఛందంగా 55 సార్లు రక్తదానం చేశాను. ఆపదలో ఉన్నవారికి ఇలా ఉపయోగపడడం చాలా సంతోషంగా ఉంది. రక్తదానం చేయడం ద్వారా ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను. ఎప్పుడు అవసరమైనా రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. మరికొంత మంది యువకులకు అపోహలు తొలగించి రక్తదానం చేసేలా కృషిచేస్తున్నాను.

శనపతి రాము, రక్తదాత, పొగిరి


స్వచ్ఛందంగా..



రక్తదానం ఆవశ్యకత తెలుసుకున్న నేను ఇప్పటి వరకు 42 సార్లు రక్తదానం చేశాను. ఎవరికైనా అత్యవసరం అనుకుంటే రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. కరోనా సమయంలో కూడా ప్లాస్మా దానం చేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది. నాలాగే మరికొంత మంది యువత రక్తదానానికి ముందుకు రావాలి.

మండల చైతన్యకుమార్, రక్తదాత, రాజాం


యువత సహకారం అవసరం..



రక్త నిల్వలు పూర్తిగా తగ్గుముఖం పట్టకుండా ఉండాలంటే యువత సహకారం ఎంతైనా అవసరం. యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేయాలి. కొన్ని చోట్ల యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయం.

పెంకి చైతన్యకుమార్, రెడ్‌క్రాస్ సభ్యుడు, రాజాం

అపోహలు వీడాలి..



రక్తదానం చేయడం వల్ల ఏదో అయిపోతుందనే అపోహలు వీడాలి. ఆరోగ్యవంతంగా ఉండి 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు ఎవరైనా రక్తదానం చేయవచ్చు. ఇప్పటి వరకు పదిసార్లు రక్తదానం చేశా. ఎటువంటి సమస్యలు తలెత్తలేదు. ప్రస్తుత తరుణంలో యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, రాజాం

గిరిజన వర్సిటీ పనులు వేగవంతం చేయండి

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక డిమాండ్



గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణిని కలిసిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధి బృందం

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ పనులను వేగవంతం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. వర్సిటీ పనులను శుక్రవారం పరిశీలించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టీవీ కట్టిమణిని కలిసి నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ 2019లో స్థాపితమైన విశ్వవిద్యాలయ నిర్మాణం ఇప్పటికీ పూర్తికాకపోవడం విచారకరమన్నారు. పనుల్లో ప్రభుత్వం అశ్రద్ధ చూపడం తగదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో గిరిజన వర్సిటీది కీలకపాత్రగా అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.విజయగౌరి, నాయకులు వెంకటరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సోమవారం సాలూరులో పీజీఆర్ఎస్

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమ వారం సాలూరులో నిర్వహిస్తామని కలెక్ట ర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లా అధి కారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. సా లూరు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని స్పష్టంచేశారు. జిల్లా అధికారులందరూ సాలూరులో నిర్వహించనున్న పీజీఆర్ఎస్‌లో పాల్గొనాలని కోరారు.